నేడు బాబా మందిరంలో గురు పూర్ణిమ పూజలు

రాజేంద్రనగర్‌: గురు పూర్ణిమ సందర్భంగా ఆదివారం ఉప్పర్‌పల్లిలోని సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ఇంద్రపాల్‌రెడ్డి తెలిపారు. దత్తాత్రేయ సాయిబాబాకు అభిషేకంతో పాటు ఉదయం 6.30 గంటలకు గురు పూర్ణిమ మహోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఈ పూజ కార్యక్రమాల అనంతరం విశేష పుష్పాలంకరణ, భగవద్గీత పారాయణం, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 6.15 గంటలకు బాబా మహా హారతి కార్యక్రమం, 7 గంటలకు విష్ణు సహస్రనామ సామూహిక పారాయణం తదితర పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

టీపీసీసీ లేబర్‌ సెల్‌ అధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి నియామకం


వెంకట్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ శాంతినగర్‌ కాలనీకి చెందిన వెంకట్‌రెడ్డి రాజేంద్రనగర్‌ నియోజకవర్గ టీపీసీసీ లేబర్‌ సెల్‌ అధ్యక్షుడిగా నియమితులైయ్యారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డికి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ప్రజల్లో ఉంటూ వారికి సేవ చేసే నాయకులకు తగిన ప్రాధాన్యత తప్పకుండా లభిస్తుందని ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌ సాగర్‌గౌడ్‌, చేవెళ్ల యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిమాయత్‌సాగర్‌ చెరువు వద్ద పూజలు


పూజలు నిర్వహిస్తున్న మేయర్‌ లతాప్రేమ్‌గౌడ్‌, డిప్యూటీ మేయర్‌ రాజేందర్‌రెడ్డి తదితరులు

బండ్లగూడ: ప్రజలకు నీటి కష్టాలు తీరాలని కోరుతూ ఆదివారం బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని హిమాయత్‌సాగర్‌ కట్ట మైసమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించారు. మేయర్‌ లతాప్రేమ్‌గౌడ్‌, డిప్యూటీ మేయర్‌ రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు రాము, అస్లాం, ప్రశాంత్‌, ఖాజా, నరేందర్‌, నాయకులు టింకు, గోపాల్‌ముదిరాజ్‌లు హిమాయత్‌సాగర్‌ చెరువు కట్టపై కొలువుదీరి ఉన్న అమ్మవారికి పూజలు నిర్వహించారు. అమ్మ దయవల్ల హిమాయత్‌సాగర్‌ చెరువు తొందరగా నిండి ప్రజలకు నీటి కష్టాలు తీరాలని ఆ అమ్మవారిని మొక్కుకోవడం జరిగిందని వారు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ రావుకోళ్ల మాలతీనాగరాజ్‌

బండ్లగూడ: 13వ డివిజన్‌లోని సాయిబాలాజీ కాలనీలో 12 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్‌ కార్పొరేషన్‌ కార్పొరేటర్‌ రావుకోళ్ల మాలతీనాగరాజ్‌ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా గోతులమయంగా మారిన రోడ్ల సమస్యను తీర్చేందుకు నూతన సీసీ రోడ్డు వేయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, ప్రభాకర్‌గౌడ్‌, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలి


జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బందితో సమావేశమైన ఉప కమిషనర్‌ రవి కుమార్‌

రాజేంద్రనగర్‌: సర్కిల్‌ కార్యాలయంలో శనివారం జీహెచ్‌ఎంసీ ఉపకమిషనర్‌ రవి కుమార్‌ పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. పారిశుద్ధ్య విభాగంలో పూర్తిస్థాయిలో విధులకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా చర్యలు తప్పవన్నారు.

మండల్‌ కమిషన్‌ సూచనలను అమలు చేయాలి

రాయదుర్గం: 'మండల్‌ దివాస్‌' కార్యక్రమాల నిర్వహణకు ఆగస్టు 7వ తేదీన 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్‌ అసోసియేషన్‌ (ఏఐఓబీసీఎస్‌ఏ) జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌ శనివారం తెలిపారు. ముఖ్యంగా మండల్‌ కమిషన్‌ సూచనలను అమలు చేయాలని, కుల గణన చేయాలని, 52 శాతం ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్‌ చేశారు. ఉన్నత విద్యాసంస్థలలో రిజర్వేషన్లను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. నేషనల్‌ ఫెలోషిప్స్‌ను ఓబీసీలకు రూ.1000 నుంచి రూ.5వేలకు పెంచాలని డిమాండ్‌ చేస్తూ 'చలో ఢిల్లీ'ని నిర్వహిస్తామని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఓబీసీలంతా పాల్గొనాలని ఆయన కోరారు.

జోరు వర్షం.. రోడ్లు జలమయం


భారీ వర్షాలకు చెరువును తలపిస్తున్న గగన్‌ పహాడ్‌ అండర్‌ బ్రిడ్జి


జేసీబీతో మురుగు నీరు క్లీన్‌ చేయిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు


వరద నీటిలో నుంచే రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు

మైలార్‌దేవ్‌పల్లి: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ జలమయం అయ్యాయి. శనివారం ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షానికి కాటేదాన్‌, బాబుల్‌రెడ్డినగర్‌, గగన్‌ పహాడ్‌, దుర్గానగర్‌లోని లోతట్టు ప్రాంతాలలో మోకాలు లోతు నీరుచేరడంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులకు గురయ్యారు. గగన్‌ పహాడ్‌ అండర్‌ బ్రిడ్జి రహదారిలో వర్షపు నీరు భారీగా చేరడంతో చెరువులా తలపిస్తుంది. దీంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. బాబుల్‌రెడ్డినగర్‌ లోతట్టు ప్రాంతంలో మురుగు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే సమాచారంతో, జీహెచ్‌ఎంసీ అధికారులు వెంటనే స్పందించారు. జేసీబీ సహాయంతో మురుగు నీరును రోడ్లపై రాకుండా క్లీన్‌ చేశారు. కొన్ని చోట్ల రోడ్లు సరిగా లేక గుంతలలో నీరు చేరి ప్రమాదకరంగా మారాయి. రోడ్లపై ఏర్పడిన గుంతలను వెనువెంటనే పూడ్చాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

బ్యాలెట్‌ బాక్స్‌లను తొలగించండి


జిల్లా కలెక్టరేట్‌ వద్ద నార్సింగి చైర్‌పర్సన్‌, వైస్‌ చైర్మన్‌, కమిషనర్‌, కౌన్సిలర్‌లు

మణికొండ: మున్సిపాలిటీ వార్డు కార్యాలయంలో పెట్టిన బ్యాలెట్‌ బాక్స్‌లను మరో చోటకు తరలించి కార్యాలయాన్ని ప్రజల సౌకర్యార్థం తమకు అప్పగించాలని నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్‌, కమీషనర్‌ టి. ప్రవీణ్‌ కుమార్‌రెడ్డిలు కోరారు. శనివారం వారు జిల్లా కలెక్టరేట్‌లోని ఎన్నికల విభాగం అధికారి సైదులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇదే విషయాన్ని గతంలోను జిల్లా కలెక్టర్‌కు వివరించామని, త్వరలోనే తొలగిస్తామని పేర్కొన్నారని తెలిపారు. పలు మున్సిపాలిటీలకు చెందిన బ్యాలెట్‌ బాక్స్‌లు ఉన్నాయని, వాటిని మార్చేందుకు అనుకూలమైన స్థలాన్ని వెతుకుతున్నామని జిల్లా అధికారి తెలిపినట్లు చైర్‌పర్సన్‌ వెల్లడించారు. త్వరలోనే వాటిని తొలగించి వార్డు కార్యాలయాన్ని అప్పగిస్తామని హామి ఇచ్చారని పేర్కొన్నారు. వైస్‌ చైర్మన్‌ జి.విజయ్‌బాబు, కౌన్సిలర్‌లు పత్తి ప్రవీణ్‌కుమార్‌, కె.ఉషారాణి, జి.శివారెడ్డి పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రవీందర్‌


నియామకపత్రం అందుకుంటున్న రవీందర్‌

శంషాబాద్‌ రూరల్‌: బీజేపీ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మండలంలోని పెద్దగోల్కొండ వాసి బోయిని రవీందర్‌ ముదిరాజ్‌ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్‌ నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ జాతీయ స్మారక సంస్థకు సామగ్రి అందజేత


సామగ్రి అందజేస్తున్న బ్యాంక్‌ ఆఫ్‌ బరోడా అధికారులు

బండ్లగూడ: బ్యాంక్‌ ఆఫ్‌ బరోడా 117వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అత్తాపూర్‌, బండ్లగూడ బ్రాంచ్‌ ఆధ్వర్యంలో హైదర్షాకోట్‌లోని కస్తూర్బా గాంధీ జాతీయ స్మారక సంస్థకు చేయూతనందించారు. ఐదు సీలింగ్‌ ఫ్యాన్స్‌, 15 ట్యూబ్‌లైట్స్‌లు, మూడు లీటర్ల గ్రైండర్‌లను అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బండ్లగూడ బ్రాంచ్‌ మేనేజర్‌ నరేష్‌, అధికారులు కీర్తి, అత్తాపూర్‌ బ్రాంచ్‌ మేనేజర్‌ స్వరూపరెడ్డి, బి.వి.తోబాలు హాజరైయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం ఎర్త్‌ గ్రీన్‌ డ్రైవ్‌లో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌ మేనేజర్‌ మూర్తి, ట్రస్ట్‌ సిబ్బంది లక్ష్మి, సమత, సౌజన్య, తిరుమలరావు, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి రైతుబాంధవుడు

గోల్కొండ: కాంగ్రెస్‌ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని కాంగ్రెస్‌ కార్వాన్‌ ఏ–బ్లాక్‌ అధ్యక్షుడు కురాకుల కృష్ణ అన్నారు. సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్‌ నాయకులు శనివారం పాలాభిషేకం చేశారు.

వందశాతం చెత్త సేకరించాలి


చెత్త సేకరణను పరిశీలిస్తున్న కమిషనర్‌ బి.శరత్‌చంద్ర తదితరులు

బండ్లగూడ: కార్పొరేషన్‌ పరిధిలోని 17వ డివిజన్‌ ప్రశాంత్‌నగర్‌, 18వ డివిజన్‌లోని మాచనపల్లి ఎన్‌క్లేవ్‌, 22వ డివిజన్‌లోని బ్యాంక్‌ కాలనీ, 21వ డివిజన్‌లోని ద్వారకానగర్‌ కాలనీలలో శనివారం జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమీషనర్‌ బి.శరత్‌చంద్ర పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఇంట్లోని చెత్తను చెత్త సేకరణ కార్మికులకు అందించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వంద శాతం ఇంటింటి చెత్తను సేకరించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. అనంతరం ప్రశాంత్‌నగర్‌ కాలనీలో స్వీపింగ్‌ పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ నరేష్‌, శానిటరీ జవాన్లు సురేష్‌, యాదగిరి, నవీన్‌, రాము, డ్రై వర్లు, స్వీపర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి


వాణిజ్య సముదాయాల యజమానులతో సమావేశమైన ఉపకమిషనర్‌ రవి కుమార్‌

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ సర్కిల్‌ పరిధిలోని థియేటర్స్‌, మాల్స్‌, వాణిజ్య సముదాయాలు, మల్టీ ఫ్లెక్స్‌ యజమానులతో శనివారం రాజేంద్రనగర్‌ సర్కిల్‌ జీహెచ్‌ఎంసీ ఉపకమీషనర్‌ రవి కుమార్‌ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యజమానులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ప్రభుత్వ నియమనిబంధనల ప్రకారం నడుచుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. పార్కింగ్‌ విషయంలో ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా.. ఉపేక్షించేది లేదన్నారు. మొదటి అర్ధగంట పాటు ఎలాంటి రుసుము తీసుకోవద్దన్నారు. వారు అందించే బిల్లులకు అనుగుణంగా నడుచుకోవాలి తప్పా.. డిమాండ్‌ చేసి పార్కింగ్‌ విషయంలో వసూలు చేయవద్దన్నారు. సర్కిల్‌ పరిధిలోని అన్ని విభాగాల సమన్వయంతో తనిఖీలు చేపడుతామని వెల్లడించారు. ట్రాఫిక్‌, లా అండ్‌ ఆర్డర్‌, టౌన్‌ ప్లానింగ్‌ తదితర విభాగాలందరితో కలిసి తరుచూ తనిఖీలు చేపడుతామన్నారు.

అల్లుకున్న ప్రమాదం



అత్తాపూర్‌ మూసీ నుంచి లంగర్‌హౌస్‌ వైపు వెళ్లే ప్రధాన రహదారిలో ఓ విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ చుట్టూ తీగజాతీ మొక్కలు అల్లుకుని ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్‌ తీగలతో ఈ మొక్కలు అల్లుకోవడంతో విద్యుత్‌ అంతరాయంతో పాటు ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంటుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ చుట్టూ ఉన్న తీగలను తొలగించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. – అత్తాపూర్‌

పాఠశాలలో చొరబడి బీభత్సం సృష్టించిన వారిని శిక్షించాలి


డీసీపీ చింతమనేని శ్రీనివాస్‌ను కలిసిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సభ్యులు

రాజేంద్రనగర్‌: ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలపై విద్యార్థి సంఘాల నాయకులంటూ దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌.ఎన్‌.రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జి.నారాయణ రెడ్డి రాజేంద్రనగర్‌ జోన్‌ డీసీపీ చింతమనేని శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 18న తెలంగాణ లీగల్‌ స్టూడెంట్స్‌ అసోసియేషన్‌ ప్రతినిధులమంటూ కాటేదాన్‌ ఆదిత్య టాలెంట్‌ స్కూల్‌లోకి ప్రవేశించి దౌర్జన్యానికి పాల్పడిన వారిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. సర్కిల్‌ పరిధిలోని వివిధ ప్రైవేటు పాఠశాలలను టార్గెట్‌ చేసుకొని ఫలానా స్టూడెంట్‌ యూనియన్‌, కుల సంఘాల నాయకులమంటూ బెదిరించి డబ్బు డిమాండ్‌ చేసిన సంఘటనలను డీసీపీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనిపై డీసీపీ చింతమనేని శ్రీనివాస్‌ చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తూ అనుమతి లేకుండా పాఠశాలల్లో ప్రవేశించి భయపెట్టాలని చూస్తే వెంటనే డయల్‌ 100కు ఫోన్‌ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. వినతి ఇచ్చిన వారిలో ప్రభాకరచారి, శ్రావణ్‌ కుమార్‌, నర్సింహా రెడ్డి, ఆనంద్‌ల, ఎస్‌.ఆర్‌.రజనీకాంత్‌, డాక్టర్‌ సంజీవ, కరుణాకర్‌, బోయ లక్ష్మణ్‌, పాల్గొన్నారు.

కోటలో నేడు 5వ పూజ

గోల్కొండ: గోల్కొండ కోటలో ఆదివారం శ్రీ జగదాంబిక మహంకాళీ అమ్మవారికి 5వ బోనం పూజ జరుగుతుందని ఆలయ కార్యా నిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు అన్నారు. శనివారం ఆయన కోటపై గల ఆలయంలో 4వ బోనం ఏర్పాట్లపై జరుగుతున్న వివరాలను వెల్లడించారు. అమ్మవారికి జరిగే మొత్తం తొమ్మిది పూజల్లో మూడో పూజకు భక్తులు భారీసంఖ్యలో వస్తారని అన్నారు. గోల్కొండ కోటలో వివిధ శాఖల ఉన్నతాధికారులు సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

గోల్కొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు స్వచ్ఛంద సేవా సంస్థలు అండగా ఉండటం గొప్ప మార్పు అని గోల్కొండ ప్రభుత్వ తెలుగు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.ఎస్‌.అనురాధాదేవి అన్నారు. స్టేట్‌ స్ట్రీట్‌ కంపెనీవారు శనివారం ఆ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 50 స్కూల్‌ బ్యాగులను పంపిణీ చేశారు.

వర్షాలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి


నాగపూర్ణ శ్రీనివాస్‌

మణికొండ: భారీగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, శుక్రవారం నుంచి ఎడతెరిపిలేకుండా వర్షాలు పడుతున్నాయని అవసరం అయితేనే ఇంట్లో నుంచి బయటకు రావాలని నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్‌ అన్నారు. శనివారం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీ వ్యాప్తంగా వర్షాలతో కలిగే ఇబ్బందులను దూరం చేసేందుకు ప్రతి వార్డుకు ప్రత్యేక సిబ్బందిని నియమించామన్నారు. రోడ్లపై ఉండే మ్యాన్‌హోల్‌లు తీసి పెట్టినపుడు అది కనిపించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. నార్సింగి వార్డులు 8,9, 17లకు చెందిన ప్రజలు జనార్దన్‌రెడ్డి ఫోన్‌ 9603458256, వార్డులు 6, 7, 16ల ప్రజలు శ్రీధర్‌ను 9849808351నెంబరుపై, మంచిరేవుల 10, 15, 18 వార్డుల ప్రజలు వంశీని ఫోన్‌ 8179035438పై సంప్రదించాలన్నారు. కోకాపేట వార్డులు 3,4, 5,14 వార్డుల ప్రజలు మహిపాల్‌ను ఫోన్‌ 9705414716పై, గండిపేట వార్డులు 11,13 ప్రజలు అహ్మద్‌ను 9966126092పై, ఖానాపూర్‌ 12వ వార్డు ప్రజలు రవిని ఫోన్‌ 9666401090పై సంప్రదించాలన్నారు. వట్టినాగులపల్లి 1వ వార్డు ప్రజలు రంజాన్‌ బాషా ఫోన్‌ 9912370889పై సంప్రదించాలన్నారు. గౌలిదొడ్డి 2వ వార్డు ప్రజలు శ్రీనివాస్‌ను 9912081989పై సంప్రదించాలన్నారు. భారీగా కురుస్తున్న వర్షాలతో ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా వారిని సంప్రదించాలని కోరారు.

కురిసిన వర్షం.. సాగుకు ఊతం


వరిసాగు పనుల్లో నిమగ్నమైన రైతులు

శంషాబాద్‌ రూరల్‌: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న జల్లులు సాగుకు ఊతమిస్తున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి వాన పడుతుండడంతో రైతులు వరి సాగు పనుల్లో బిజీ అయిపోయారు. వానాకాలం మొదలై రెండు నెలలు కావస్తున్నా ఆశించిన వర్షాలు లేక వరిసాగుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో తాజాగా కురుస్తున్న వానలతో కరిగెట్లు పనులు ఊపందుకున్నాయి. వరి నాట్లు వేసేందుకు రైతులు తమ పనుల్లో నిమగ్నమయ్యారు. జల్లులతో కొంత వరకు సాగుకు ఉపయోగం ఉన్నా.. భారీగా వర్షం కురిస్తేనే వరదలు పారి చెరువులు, కుంటలు నిండుకుంటాయి. దీంతో భూగర్భ జలాలు పెరిగి బోర్లలో నీటి మట్టాలు పెరుగుతాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాధార పంటలతో పాటు వరి, కూరగాయల సాగుకు ప్రయోజనం కల్గనుంది.

వరిసాగుకే ప్రధాన్యం..

మండలం పరిధిలోని మల్కారం, సుల్తాన్‌పల్లి, కేబీ.దొడ్డి, రామంజాపూర్‌, కవ్వగూడ, ననాజీపూర్‌, జూకల్‌, తదితర గ్రామాల్లో ఖరీఫ్‌లో ఎక్కువగా వరి సాగు చేపడుతుంటారు. ఇందుకోసం రైతులు ఇప్పటికే వరినారు మడులు సిద్ధం చేసుకున్నారు. నార్లు వేసేందుకు కరిగెట్లు పనులు పూర్తి కాకపోవగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమయంలో కురుస్తున్న వానలు రైతుల్లో ఆశలు నెలకొల్పుతున్నాయి. గత ఏడాది ఖరీఫ్‌లో 5290 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ ఏడాది అధనంగా సాగు విస్తీర్ణం పెరుగుతుందని భావిస్తున్నారు. సాగు విస్తీర్ణం పూర్తిగా వానాకాలంపై ఆధారపడి ఉంది.

కాంగ్రెస్‌లో వర్గ పోరు

గాంధీ ప్రసంగానికి అడ్డు తగిలిన కార్యకర్తలు

గచ్చిబౌలి: సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలోనే శేరిలింగంపల్లి కాంగ్రెస్‌పార్టీలో వర్గ పోరు బయటపడింది. శనివారం గోపన్‌పల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లైఓవర్‌ ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతుండగా స్టేజీ ఎదురుగా ఉన్న కొందరు కార్యకర్తలు జై జగదీశ్వర్‌గౌడ్‌ అంటూ నినాదాలు చేసి ప్రసంగానికి అడ్డుతగిలారు. గత అసెంబ్లీ ఎన్నికలలో జగదీశ్వర్‌గౌడ్‌ కాంగ్రెస్‌ అభ్యర్థిగా బరిలో నిలిచి గాంధీ చేతిలో ఓటమీ పాలయ్యారు. కాగా గాంధీ కాంగ్రెస్‌ పార్టీలోకి రావడం జగదీశ్వర్‌గౌడ్‌ వర్గానికి ఇష్టం లేదు. పైగా జగదీశ్వర్‌గౌడ్‌ను ఆలస్యంగా స్టేజి పైకి పిలవడంతో నినాదాలు చేసినట్లుగా తెలుస్తోంది. ఎమ్మెల్యే మాట్లాడుతుండగా నినాదాలు చేయడంతో పోలీసులు జోక్యం చేసుకొని సర్ది చెప్పారు. స్టేజీ మీద ఉన్న జగదీశ్వర్‌ గౌడ్‌ నినాదాలు వద్దని వారించినా అనుచరులు హడావిడి చేశారు. సీఎం మాత్రం అన్ని గమనిస్తూ ఉండిపోయారు.